హరహర.. మహాదేవ

భక్తిశ్రద్ధలతో మహా శివరాత్రి

మహా శివరాత్రిని పురస్కరించుకుని జిల్లాలో శివాలయాలకు భక్తులు పోటెత్తారు. భక్తుల శివనామస్మరణతో ఆలయాలన్నీ మార్మో గాయి. ఆయా ఆలయాల వద్ద అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.





గుడ్లవల్లేరులో రుద్రాక్షలతో రూపొందించిన శివ లింగాన్ని పూజించేందుకు బారులు తీరిన భక్తులు, ఐలూరులో రామేశ్వరస్వామికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్



పామర్రులోని బుచ్చమ్మ తల్లి ఆలయంలోని మల్లేశ్వరస్వామి

తోట్లవల్లూరు: దక్షిణకాశీ ఐలూరు గ్రామంలోని కృష్ణానది తీరం శివరాత్రి సందర్భంగా తరలివచ్చిన భక్తజనంతో పోటెత్తింది. పుణ్యస్నానాల కోసం వచ్చిన భక్తులతో పండగ వాతావరణం నెలకొంది. భారీగా విచ్చేసిన భక్తులతో శ్రీగంగా పార్వతీ సమేత రామేశ్వర స్వామి సన్నిధి కిటకిటలాడింది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన జల్లుస్నానాల వద్ద భక్తులు స్నానాలను ఆచరించి, పితృదేవతలకు పిండ ప్రదానాలు, మహిళలు వాయనాలు ఇచ్చిపుచ్చుకున్నారు. పమిడిముక్కల సీఐ ఎం.కిషోర్‌బాబు, ఎస్‌ఐ విశ్వనాథ్ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ కుసుమ కుమారి, ఎంపీడీఓ సత్యనారాయణ, ఆలయ ఈఓ జయశ్రీ, ఉత్సవ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఎమ్మెల్యే కైలే ప్రత్యేక పూజలు

రామేశ్వరస్వామిని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ దర్శించుకుని పూజలు చేశారు. స్వామి వారికి శాస్త్రోక్తంగా పట్టువస్త్రాలు సమర్పించి వేదపండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు. తోట్లవల్లూరులోని కృష్ణానది పుష్కరఘాట్ వద్ద భక్తులు పుణ్యస్నానాలను ఆచరించి, పితృదేవతలకు పిండ ప్రదానం చేశారు. అనంతరం స్థానిక శ్రీభ్రమరాంబ చెన్నమల్లికార్జునస్వామి, వేణుగోపాలస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. సర్పంచ్ పెనుమత్స రాధిక పర్యవేక్షించారు.

భక్తులకు సేవలు

తోట్లవల్లూరు శివాలయంలో వాసవీక్లబ్, మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యాన 150 కేజీల పులిహోరను భక్తులకు పంపిణీ చేశారు. ఆలయ ఈఓ హరి దుర్గా నాగేశ్వరరావు, వాసవీక్లబ్ ప్రతినిధి తమ్మన ఉమామహేశ్వరరావు, తదితరులు పర్యవేక్షించారు. పెనమకూరులో భారత యువజన సంఘం ఆధ్వర్యంలో ఐలూరు వెళ్లే భక్తులకు మజ్జిగ పంపిణీ నిర్వహించారు.

మండవల్లిలో..


మండవల్లి: మండలంలోని మండవల్లి, అల్లినగరం, అయ్య వారి రుద్రవరం, శోభనాద్రిపురం శివాలయాల్లో, మండలంలోని పలు గ్రామాల్లో మహాశివ రాత్రి పురస్కరించుకుని శుక్రవారం ఘనంగా పూజలు నిర్వహించారు. స్థానిక శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో గురువారం అర్ధరాత్రి నుంచి మల్లేశ్వరస్వామి, భ్రమరాంబదేవికి అర్చకులు గూడూరు శ్రీనివాసరావు భక్తులతో ప్రత్యేక పూజలు చేయించారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిపించారు. గురజ శ్రీరామలింగేశ్వరస్వామి పెదగొన్నూరు మల్లేశ్వరస్వామి చినకామనపూడి మహంకాళేశ్వరస్వామి పెదకామనపూడి రామలింగేశ్వరస్వామి వడాలి శివాలయంలో భక్తులు తెల్లవారుజాము నుంచే పూజలు చేశారు. సింగరాయపాలెం శ్రీఅమృతేశ్వరస్వామి ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు చేరుకుని పూజలు అభిషేకాలు చేశారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: స్థానిక బంటుమిల్లి రోడ్‌లో వేంచేసియున్న శ్రీ భీమేశ్వరస్వామి వారి దేవస్థానం, గౌరీశంకరపురంలో వేంచేసియున్న శ్రీ గౌరీశంకర స్వామి వారి దేవస్థానం, బేతవోలులో వేంచేసియున్న శ్రీ ఆనందేశ్వరస్వామి దేవస్థానంలో శివరాత్రి మహోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. స్వామిని పంచామృతాలతో అభిషేకాలు చేసి పుష్పాభిషేకం గావించారు.



మండవల్లి మల్లేశ్వరస్వామికి పూజలు

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: శివరాత్రి సందర్భంగా గుడ్లవల్లేరు శ్రీ సిద్దేశ్వరాలయంలో స్వామికి శుక్రవారం ఏకాదశ రుద్ర హోమం జరిగింది. కొతవరం గౌతమేశ్వరాలయంలో ఆలయ ప్రధానార్చకుడు అంబా గౌతమేశ్వరరావు అర్చక బృందం స్వామికి ప్రత్యేకాభిషే కాలు నిర్వహించారు. వేమవరంలో శ్రీ నాగేశ్వర స్వామివారి ఆలయంలో ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రుద్రపాక లక్ష్మీ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో స్వామికి విశేషాభిషేకాలను పండితుడు శరత్‌చంద్రచే నిర్వహింపజేశారు. గుడ్లవల్లేరు శ్రీ కన్యకా పరమేశ్వరీ దేవి పంచాయన క్షేత్రంలో నగరేశ్వరాలయంలో స్వామికి, విన్నకోట భోగేశ్వరాలయం తదితర ఆలయాల్లో అభిషేకాలు చేశారు.

పెదపారుపూడిలో..

పెదపారుపూడి: మండలంలోని వెంట్రప్రగడ, యలమర్రు, వానపాముల తదితర గ్రామాల్లోని శివాలయాల్లో శివరాత్రి పురష్కరించుని శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంట్రప్రగడలోని శ్రీనామేశ్వరరావు స్వామికి ప్రత్యేక పండ్ల రసాలతో అభిషేకాలు నిర్వహించారు.

ఘనంగా శివ పార్వతుల కల్యాణం

పామర్రు: గంగాపార్వతీ సమేత శ్రీసోమేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని శివపార్వతుల కల్యాణోత్సవం శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాన్ని కేవీ వెంకటసురేష్ కల్యాణ మంత్రాలను పఠిస్తూ వాటికి అర్థాలను భక్తులకు వివరిస్తూ ఉత్సవాన్ని ఘనంగా జరిపించారు. ఆలయ అర్చకులు లంకా భీష్మ కుమార్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించినట్లు ఆలయ మేనేజరు బీరం మధుసూదనరావు తెలిపారు.

పామర్రు: మండలంలోని ప్రాకర్ల గ్రామంలోని శ్రీ గంగా పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయం పక్కనే ఉన్న కొలనులో భక్తులు పుణ్యస్నానాలు చేసి స్వామిని పూజించారు.

విశేష పూజలు

శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పలు శైవాలయాల్లో మహాశివునికి విశేషంగా అభిషేకాలు పూజలను నిర్వహించారు. స్థానిక గంగాపార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి ఆలయంలో స్వామికి విశేషంగా ఏకాదశ రుద్రాభిషేకాలు, నమక చమకాలతో ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించారు.బుచ్చమ్మ తల్లి ఆలయంలో మల్లేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు.

భోగేశ్వరలంకలో..

కలిదిండి:/కైకలూరు: దక్షిణ కాశీగా పేరుగాంచిన భోగేశ్వరలంక శివన్నామస్మరణతో మార్మోగింది. రెండు లక్షల పైబడి భక్తులు స్వామిని దర్శించుకున్నారు. శుక్రవారం రాత్రి స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించారు. కుటుంబ సమేతంగా స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి భారీ క్యూలో భక్తులు స్వామి దర్శనానికి వేచి ఉన్నారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ దంపతులు స్వామిని దర్శించుకున్నారు. మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఎలాంటి ఆటంకాలు లేకుండా ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు, రెవెన్యూ, విద్యుత్, వైద్యం, పోలీస్ శాఖల అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. సర్పంచ్ మసీముక్కు మారుతిప్రసన్న, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, రాష్ట్ర నాయకులు సయ్యపురాజు గుర్రాజు, జెడ్పీటీసీ సభ్యురాలు బొర్రా సత్యవతి, ఏఎంసీ చైర్మన్ కొల్లాటి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తిరుమాని రమేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు వడుపు రామారావు పాల్గొన్నారు.



స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే డీఎన్నార్ దంపతులు

ఆటపాక శివాలయంలో

కైకలూరు మండలం ఆటపాక శివాలయానికి శుక్రవారం ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ కుటుంబ సమేతంగా వచ్చి స్వామికి పూజలు చేశారు. అదే విధంగా కైకలూరు శ్యామలాంబ దేవస్థానంలో శ్రీరామేశ్వరస్వామి శివాలయానికి ఉదయం భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వీఎన్‌కే.శేఖర్, ఉప సర్పంచ్ నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు రామారావు, నారాయణ, రాము పాల్గొన్నారు.



తోట్లవల్లూరు మండలం ఐలూరులో జల్లుస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



పామర్రులో నిర్వహించిన కల్యాణోత్సవంలో శివపార్వతుల ఉత్సవ మూర్తులు



గుడివాడలో స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

ఘనంగా మహిళా దినోత్సవం

గుడివాడ టౌన్: మహిళా దినోత్సవాన్ని శుక్రవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక కేటీఆర్ మహిళా కళాశాలలో శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ వి. సుజాత, వైస్ ప్రిన్సిపాల్ ఎం. గాయత్రిని సత్కరించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ లంకదాసరి ప్రసాదరావు, బొగ్గారపు తిరుపతయ్య, పుట్టి హరికుమార్, అబ్దుల్ గఫార్, జాజుల తాతారావు, డీఆర్‌బీ ప్రసాదు, కె. హరిబాబు పాల్గొన్నారు. స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజనీరింగ్ కళాశాలలో మహిళా అధ్యాపకులు గైనకాలజిస్ట్ డాక్టర్ రోజాను సత్కరించారు. ప్రొఫెసర్ కె. దేవి, జి.పద్మావతి, డి. నిశ్చల, శ్రావణి, సుస్మిత పాల్గొన్నారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం మహిళా అధ్యక్షురాలు పరిశె వాణిశ్రీని ఘనంగా సత్కరించారు.గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక త్రివేణి పబ్లిక్ స్కూల్లో ఉపాధ్యాయిని మారుమూడి స్వరూపను ఘనంగా సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు ఎం. శివరామకృష్ణ, కార్యదర్శి కె. రామారావు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో ముందంజలో మహిళలు

గుడ్లవల్లేరు: సమాజంలో అన్ని రంగాల్లో మహిళలు ముందంజలో ఉండాలని రెవెన్యూ డీటీ బి.కనక దుర్గ పిలుపునిచ్చారు. శుక్రవారం గుడ్లవల్లేరు సచివాలయంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్య అతిథిగా విచ్చేసిన కనకదుర్గతోపాటు మహిళా సచివాలయ ఉద్యోగులకు సన్మానం చేశారు. గ్రామ కార్యదర్శి జి.వి.ఎల్.ఆర్.నరసింహారావు పాల్గొన్నారు.

పామర్రులో..

పామర్రు: మహిళాభ్యుదయమే దేశానికి రక్ష అని పద్మశ్రీ ఘంటసాల ఎస్పీ బాలు స్మారక సంగీత కళాపీఠం గౌరవాధ్యక్షుడు, అధ్యక్షుడు కోటి పాండురంగారావు, కాటూరి వెంకట మురళీ కృష్ణ పేర్కొన్నారు. స్థానిక రైతు బజారులోని మహిళా రైతులను మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో పామర్రు రైతు బజారు ఎస్టేట్ ఆఫీసర్ బలిజేపల్లి శ్రీనివాసరావు, ఏపీ క్రైస్తవ సంక్షేమ సంఘ అధ్యక్షుడు సాల్మన్ కొల్లాబత్తుల పాల్గొన్నారు.

తాడంకిలో..

పమిడిముక్కల: తాడంకి సచివాలయంలో శుక్రవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ జంపాన దనలక్ష్మి, కార్యదర్శి బందారు సునీత కేక్ కట్ చేశారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సర్పంచ్ దనలక్ష్మిని సత్కరించారు. అనంతరం మహిళా సచివాలయ సిబ్బందిని, వలంటీర్లను సర్పంచ్ ధనలక్ష్మి సత్కరించారు.



కేటీఆర్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్‌ను సత్కరిస్తున్న యాదవ సేవా సంఘం సభ్యులు



గుడ్లవల్లేరులో డీటీ కనకదుర్గను సన్మానిస్తున్న సచివాలయ సిబ్బంది



తాడంకిలో కేక్ కట్ చేస్తున్న సర్పంచ్ ధనలక్ష్మి, కార్యదర్శి సునీత



పామర్రులో మహిళలను సన్మానిస్తున్న కళాపీఠం సభ్యులు

మండవల్లిలో..

మండవల్లి: ప్రభుత్వం మహిళా సాధికారతకు మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించినప్పటికీ, ఎన్నికైన పలువురు పదవుల్లో వారికి బదులు భర్త, కుటుంబ సభ్యులు ఆ పదవులలో కొనసాగుతున్నారని ఐక్య వేదిక జిల్లా కార్యదర్శి ఎల్ఎస్ భాస్కరరావు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక గ్రంథాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బలహీనవర్గాల అభ్యున్నతికి జగజ్జీవన్‌రామ్ ఎనలేని సేవలు

గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడరూరల్: అట్టడుగు వర్గాల ప్రజల అభ్యున్నతికి స్వర్గీయ మాజీ ఉప ప్రధాని బాబు జగజ్జీవన్ రామ్ ఎనలేని సేవలందించారని మాజీ మంత్రి, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) పేర్కొన్నారు. మండలంలోని చిరిచింతల గ్రామంలో శుక్రవారం జగజ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి బాపట్ల ఎంపీ నందిగం సురేష్‌తో కలసి మాజీ మంత్రి కొడాలి నాని ముఖ్య అతిథిగా పాల్గొని గ్రామస్తులతో కలసి విగ్రహాన్ని ఆవిష్కరించారు. తొలుత చిరిచింతల గ్రామ సెంటర్‌లో ఎమ్మెల్యే కొడాలి నాని, ఎంపీ సురేష్‌లకు గ్రామ పొలిమేరల్లో పూలవర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామస్తులతో కలసి భారీ ర్యాలీగా పర్యటించారు. ఇరువురు నాయకులు కలసి జగజ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొడాలి నాని మాట్లాడుతూ దేశానికి గొప్ప సేవలు అందించిన మహనీయుడు మాజీ ఉప ప్రధాని జగజ్జీవన్ రామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన గ్రామ పెద్దలు అభినందనీయులన్నారు. రాజ్యసభ సీట్లు, ఎమ్మెల్యే టికెట్లను చంద్రబాబు అమ్ముకుంటుంటే, ఎంపీ సురేష్ లాంటి పేదలు, చిన్న కుటుంబాల్లో పుట్టిన వారికి టికెట్లు ఇస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బడుగు వర్గాల పక్షాన నిలబడ్డారన్నారు. కోట్లాది రూపాయలకు టికెట్లు కొనుక్కొని డబ్బు సంచులతో వస్తున్న ఎన్నారైలను ప్రజలు తరిమికొట్టాలని కొడాలి నాని పిలుపునిచ్చారు. బాపట్ల ఎంపీ నందిగం సురేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు విగ్రహాల ఏర్పాటుకే పరిమితం అయ్యేవని, కానీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అంబేడ్కర్, జగజ్జీవన్‌రామ్, పూలే లాంటి మహనీయుల స్ఫూర్తితో పాలన చేస్తున్నారన్నారు. చంద్రబాబు కోటీశ్వరులు, పెత్తందారుల ప్రయోజనాల కోసం రాజకీయం చేస్తాడే తప్ప బడుగు, బలహీన వర్గాలతో పని లేదన్నారు. సామాన్యులకు, బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ ప్రాధాన్యం ఇస్తున్న సీఎం జగన్ నాయకత్వానికి ప్రజలందరూ మద్దతు పలకాలని ఎంపీ కోరారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ మట్టా నాగమణివిక్టర్, ఎంపీపీ గద్దే పుష్పరాణి, నందివాడ ఎంపీపీ పెయ్యల ఆదాం, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్, నాయకులు పాలడుగు రామ్‌ప్రసాద్, వల్లూరిపల్లి సుధాకర్, హరిబాబు, గిరిబాబాయ్, నందివాడ మండల వ్యవసాయ సలహా కమిటీ అధ్యక్షుడు కొండపల్లి కుమార్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు తోట రాంబాబు, పటాన్ గౌస్లా, మీగడ మురళీ, కలతోటి థామస్, ఎంపీటీసీ సభ్యురాలు శింగవరపు ఝాన్సీరాణి, ఏఎంసీ డైరెక్టర్‌లు కలపాల కిరణ్, చందనపల్లి సుందరరావు, మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు తోట నాగమునిమ్మ, నాయకులు కారే జోసఫ్, గద్దే రాము, కళ్లేపల్లి పవన్, బొప్పన రాజబాబు, కిరణ్, బాజీ, రవి, సురేష్, శేఖర్, సైమన్ పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని, ఎంపీ నందిగం

సారా తయారీ కేంద్రాలపై పోలీసుల దాడి

కోనేరుసెంటర్: బందరు మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం సెబ్, ఇంటెలిజెన్స్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సారా తయారీ కేంద్రాలపై దాడులు చేశారు. పోలాటితిప్ప గ్రామంలో కొంత మంది సారా తయారు చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు సెబ్ సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఇంటెలిజెన్స్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడి చేసి 17 వందల లీటర్ల బెల్లపు ఊటను గుర్తించి అక్కడికక్కడే ధ్వంసం చేశారు. 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీకి ఉపయోగించే సామగ్రిని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. గ్రామాల్లో సారా తయారుచేసినా, అమ్మకాలు జరిపినా వెంటనే తమకు సమాచారం అందజేయాలని సీఐ సత్యనారాయణ గ్రామస్తులను కోరారు. తయారీదారులను పట్టుకుని కేసు నమోదు చేస్తామని ఆయన తెలిపారు.

పథకాలు అందాలంటే వైఎస్సార్ సీపీని గెలిపించాలి

ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్

పద్దారాయుడుతోట (మొవ్వ): సంక్షేమ ఫలాలు సక్రమంగా అందాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలిపించాల్సిన బాధ్యత అందదరిపై ఉందని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. మొవ్వ మండలం పద్దారాయుడు తోట గ్రామంలో రూ.23.94లక్షల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, రూ20.80లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్లను ఎంపీపీ కొండేటి ఇందిర, జెడ్పీటీసీ రాజులపాటి పార్వతిలతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. అలాగే గ్రామంలోని 40మందికి ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేసి గ్రామంలో రూ.14లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. ముందుగా కాజ శివారు కళాయిగుంట గ్రామంలో రూ.10లక్షల వ్యయంతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ శంకుస్థాపన, రూ.31లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు కోసూరు తురకపాలెంలో రూ.20లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డులను ప్రారంభించారు. కార్యక్రమాల్లో నాయకులు గోగినేని పెరుమాళ్లు, మంద శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు పాల్గొన్నారు.



కోసూరులో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

కులమతాలకతీతంగా ప్రతి ఒక్కరికీ మేలు

గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని

గుడ్లవల్లేరు: కులమతాలు, రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరికీ మేలు జరిగే విధంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) పేర్కొన్నారు. శేరీ దగ్గుమిల్లిలో నూతన గ్రామ సచివాలయ నిర్మాణ భవనాన్ని ఆయన గురువారం రాత్రి ప్రారంభించారు. తొలుత ఎమ్మెల్యే కొడాలికి గ్రామస్తులు పూల మాలలు వేసి పూల వర్షం కురిపిస్తూ గ్రామంలోకి స్వాగతం పలికారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్, ఎన్టీఆర్ స్టేడియం వైస్ చైర్మన్ పాలేటి చంటి, కేడీసీసీ జిల్లా డైరెక్టర్ పడమటి సుజాత, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ శాయన రవి, పీఏసీఎస్ అధ్యక్షుడు దుగ్గిరాల శేషుబాబు, సర్పంచులు వీరమ్మ, లక్ష్మణరావు, జ్యోతి, కొండలమ్మ ఆలయ చైర్మన్ శేషం గోపి, పార్టీ మండల బూత్ కమిటీల కన్వీనర్ కోటప్రోలు నాగు, నాయకులు చిరంజీవి, జితేంద్ర, సత్యనారాయణ, శివకుమార్, చలమయ్య పాల్గొన్నారు.



గ్రామ సచివాలయ శిలా ఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే కొడాలి నాని

భైరవపట్నంలో ప్రజాశీర్వాద యాత్ర

మండవల్లి: మండలంలోని భైరవపట్నంలో గురువారం రాత్రి సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా 18వ రోజు ప్రజాశీర్వాద యాత్ర వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ (జేవీఆర్) భారీ ర్యాలీలో పాల్గొని ప్రజలకు అభివాదం తెలిపారు. రూ.20 లక్షలతో సీసీ డ్రైన్‌లు, రూ. 43.60 లక్షలతో నిర్మాణం జరిగిన గ్రామ సచివాలయ నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ రాష్ట్రంలో రామరాజ్యం స్థాపించిన సీఎం జగన్‌ను, పార్లమెంట్ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్‌ను, తనను ఆశీర్వదించాలని కోరారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గా ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, రాష్ట్ర నాయకుడు సయ్యపురాజు గుర్రాజు, సర్పంచ్‌లు ఎస్.రాధనాగేంద్ర, బి.యేసోబురాజు, ఎంపీటీసీ సభ్యుడు ఎస్.కిరీటిరాజు తదితరులు పాల్గొన్నారు.



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ

క్లుప్తంగా

బీసీ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడిగా మల్లేశ్వరరావు



గుడివాడ టౌన్: ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన రావులకొల్లు మల్లేశ్వరరావు నియమితులయ్యారు. సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్. మారేష్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నట్లు మల్లేశ్వరరావు తెలిపారు.

విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన



గుడివాడ టౌన్: బాలికలు విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి కె.నాగలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక లింగవరం రోడ్‌లోని బాలికల బీసీ సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వాలు చట్టాలపై అవగాహన పెంచేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయని, తద్వారా మహిళలు చైతన్యవంతులవుతున్నారన్నారు. ఏ చట్టం ఎందుకు ఉపయోగపడుతుంది, మహిళల హక్కులు, బాధ్యతలు కూడా వీటి వలన అవగాహన అవుతుందన్నారు. సమాజ శ్రేయస్సు కోసం బాలికలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. హాస్టల్ వార్డెన్ ఎం. లలిత పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం

పమిడిముక్కల: ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా కేంద్ర సాయుధ బలగాలతో కలిసి పోలీసులు మండలంలోని మంటాడ, పమిడిముక్కల, మేడూరు, ధూళిపూడిపాలెం, అలీనభీపాలెం గ్రామాల్లో శుక్రవారం కవాతు నిర్వహించారు. ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా, ప్రజల్లో ధైర్యం నింపేందుకు కవాతు నిర్వహించినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదపారుపూడి: మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం విద్యుత్ లైన్లు, సబ్ స్టేషన్ మరమ్మతుల కోసం శనివారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టీ రామకృష్ణ శుక్రవారం తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

వేగంగా నేషనల్ హైవే విస్తరణ పనులు

మండవల్లి: నేషనల్ హైవే విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. విజయవాడ-భీమవరం రహదారి మార్గంలో ఉన్న మండవల్లిలో శుక్రవారం విస్తరణ పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ నాగరాజు మాట్లాడుతూ పూర్తిస్థాయిలో నేషనల్ హైవే విస్తరణ జరగడానికి సుమారు రెండు సంవత్సరాలు పడుతుందని తెలిపారు.

జగన్ పాలనలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

కలిదిండి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రామాలు అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) తెలిపారు. పార్టీ నాయకులతో కలిసి కోట కలిదిండి ఈద్గా కాలనీలో రూ.37లక్షల పంచాయతీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన ప్రారంభించి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వచ్చే ఎన్నికల్లో ప్రజలు జగన్‌కు అండగా ఉండాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యురాలు బొర్రా సత్యవతి, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, నాయకులు సయ్యపురాజు గుర్రాజు, సర్పంచ్ మసీముక్కు మారుతి ప్రసన్న, ఏఎంసీ చైర్మన్ కొల్లాటి సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు తిరుమాని రమేష్, ఎంపీటీసీ షఫాయితుల్లా, మాజీ ఏఎంసి చైర్మన్ నీలపాల వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ ముత్తిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు ఆశీస్సులు అందరిపై ఉండాలి



కలిదిండి: ఏసుక్రీస్తు ఆశీస్సులు అందరికీ ఉండాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. కైకలూరు ఆర్‌సీఎం చర్చి నుంచి కలిదిండి మరియమాత దేవాలయం వరకూ శిలువ యాత్ర శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వెంకటాపురం గ్రామంలో శిలువ యాత్రలో ఎమ్మెల్యే డీఎన్నార్ పాల్గొని శిలువను మోశారు.